

ప్రతిన బూనుదాం..

గంజాయి కట్టడికి పోలీసులు చేపట్టిన చర్యలకు తోడు తల్లిదండ్రులు కూడా పిల్లలను నిశితంగా గమనిస్తేనే నిర్మూలన సాధ్యమవుతుంది. 10లో



ఖమ్మం మార్కెట్‌కు మహర్దశ!

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ స్థానంలో మోడల్ మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.155కోట్లను మంజూరు చేసింది. 12లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం ఎండ ఎక్కువగానే ఉంటుంది. సాయంత్రం తర్వాత మాత్రం వాతావరణం చల్లబడే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు ఖమ్మం 28వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో ఆయన స్ట్రోమ్ వాటర్ డ్రైయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అలాగే, సాయంత్రం రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తి, గణేశ్వరం, చెరువుకొమ్ముతండా, వేపకుంట్లలో డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఇక రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం సాయంత్రం 5.30గంటలకు ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొంటారు. అలాగే, శుక్రవారం ఉదయం ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లులో సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన చేస్తారు.

కొనసాగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఏడో రోజైన బుధవారం శ్రీవారికి అర్చకులు అభిషేకం చేశాక యాగశాలలో సామూహిక చండీహోమం నిర్వహించారు. ఆతర్వాత అలివేలుమంగ అమ్మవారిని సరస్వతీదేవి రూపంలో అలంకరించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆతర్వాత పలువురు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు శ్రీనివాసశర్మ, అర్చకులు ఉప్పల మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

తపాలా పథకాలను వినియోగించుకోవాలి



ర్యాలీలో సూపరింటెండెంట్, ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: కేంద్రప్రభుత్వం తపాలా శాఖ ద్వారా అమలుచేస్తున్న పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి సూచించారు. ప్రపంచ తపాలా దినోత్సవం, జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా బుధవారం శాఖ ఉద్యోగులు ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీ పాత మున్సిపల్ కార్యాలయం, పాత బస్టాండ్ మీదుగా రైల్వేస్టేషన్‌కు చేరింది. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మాట్లాడుతూ తపాలా శాఖ ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా పొదుపు, బీమా పథకాలను అమలుచేస్తోందన్నారు. హెడ్ పోస్టుమాస్టర్ నాగార్జునరెడ్డి, నారాయణ, పలువురు పోస్టుమాస్టర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్ వ్యవహారంపై విచారణ పూర్తి

- దోషులపై చర్యలు, ఆర్ఆర్ యాక్ట్ అమలు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తీసుకున్న పలువురు మిల్లర్లు గడువులోగా సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇవ్వకపోవడమే కాక ధాన్యం పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చిన విషయం విదితమే. టాస్క్‌ఫోర్స్ అధికారులు ఇటీవల చేపట్టిన తనిఖీల్లో ఈ ఆరోపణలు నిజమేనని తేలింది. దీంతో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో చేయించిన విచారణ బుధవారం పూర్తయింది. ఈ మేరకు మిల్లర్లు తమకు కేటాయించిన సీఎంఆర్‌ను గడువులోగా చెల్లించాల్సి ఉండగా.. నిరంతరం పౌరసరఫరాల శాఖ అధికారులపై పర్యవేక్షించాలని ఉందని అదనపు కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. అయితే, గత నెల 24న చేపట్టిన తనిఖీల్లో కొందరు మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకపోగా, మిల్లుల్లో కేటాయించిన ధాన్యం నిల్వలు లేవని గుర్తించినట్లు చెప్పారు. ఈ విషయమై విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా సీఎంఆర్ పక్కదారి పట్టించిన మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలుచేయడమే కాక విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

అనుమతి మాటున అడ్డగోలుగా..

జిల్లా అంతటా జోరుగా మట్టి దందా

- మూడు క్వారీల్లోనే తవ్వకానికి అనుమతులు
- అయినా పరిమితికి మించి తవ్వకాలు, తరలింపు
- భవన నిర్మాణాలు, వెంచర్లకు యథేచ్ఛగా వినియోగం
- రఘునాథపాలెం మండలంలో కరిగిపోతున్న గుట్టలు



రఘునాథపాలెం మండలం జింకలతండా క్రాస్ వద్ద మట్టి తవ్వకంతో ఆనవాళ్లు కోల్పోయిన గుట్ట

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రూ.కోట్ల విలువైన మట్టి అక్రమంగా తరలుతోంది. మట్టి తవ్వకాలతో పెద్ద పెద్ద గుట్టలు కూడా నానాటికీ కరిగిపోతున్నాయి. జిల్లాలోని మూడు ప్రాంతాల్లో మాత్రమే మట్టి తవ్వకానికి మైనింగ్ శాఖ అనుమతులు ఉన్నాయి. కానీ అక్రమార్కులు మాత్రం అనుమతితో అవసరం లేదంటూ తవ్వకాలు చేపడుతుండగా.. కొందరు తాత్కాలిక అనుమతులు తీసుకుని ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లో మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతోంది. దీన్ని అరికట్టాల్సిన మైన్స్ అండ్ జియాలజీ అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తుండగా.. సహజ వనరులు రూపురేఖలను కోల్పోతున్నాయి.

ఆనవాళ్లే ఉండవు..

రఘునాథపాలెం మండలంలోని గుట్టలను రాత్రింబవళ్లు తవ్వి తరలిస్తుండగా కరిగిపోతున్నాయి. ఖమ్మం సమీపాన ఉన్న ఈ మండలంలో దందాకు అడ్డుకట్టవేసే వారే లేరు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పెద్దలను అడ్డు పెట్టుకుని గుట్టలను గుల్ల చేస్తుండడం గమనార్హం. మట్టి తరలింపులో ఇష్టారీతిన వ్యవహరిస్తుండడంతో దుమ్ముధూళితో అవస్థ పడుతున్నామని స్థానికులు మొరపెట్టుకుంటున్నా అధికారులు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

డిమాండ్ పెరగడంతో..

జిల్లాలో భవన నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు పెరిగిపోయాయి. దీంతో మట్టి కూడా అదే స్థాయిలో అవసరముంటోంది. ఈ క్రమాన వ్యాపారులు గత పరిచయాలు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని అనుమతులు లేకున్నా మట్టి లభ్యత ఉన్న చోటు నుంచి మట్టి తరలిస్తున్నారు. లీజ్ ఉన్న క్వారీల నుంచి మట్టి తరలించాలంటే ఎక్కువ వ్యయమవుతుండడంతో ఈ మార్గం ఎంచుకుంటున్నారు. అనుమతి ఉన్న క్వారీలు కాకుండా.. మిగిలిన చోటు నుంచి మట్టి తవ్వకం, తరలింపునకు హైవే నిర్మాణ సంస్థలకే అవకాశముంటుంది. దీంతో కొందరు ఆయా ప్రాంతాలపై కన్నేసి రాత్రి వేళ మట్టిని తరలిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

తాత్కాలిక అనుమతులే ఆసరాగా..

హైవేల నిర్మాణానికి సంబంధిత అధికారులు మట్టి కోసం మైన్స్ అండ్ జియాలజీ శాఖ నుంచి తాత్కాలిక అనుమతి తీసుకుంటారు. వీరికి రెండు, మూడు నెలల పాటు మట్టిని తరలించేందుకు అవకాశముంటుంది. అయితే, అనుమతి ఇచ్చినందుకు ప్రభుత్వానికి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, రియల్ ఎస్టేట్ వెంచర్లలో రహదారుల నిర్మాణం, ఇతర పనులకు మట్టి అవసరం కావడంతో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తాత్కాలిక అనుమతుల పేరుతో పరిమితికి మించి మట్టి తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అనుమతి గడువు ముగిసినా మట్టిని తరలిస్తూనే ఉండడం.. అధికారుల అండదండలతో హైవే అధికారులకు మాత్రమే దక్కే అనుమతులు ఇతరులు కూడా సాధిస్తున్నట్లు తెలిసింది.

మేమున్నా పట్టించుకోం..

అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నారని.. దుమ్ముధూళితో ఇబ్బంది పడుతున్నామని పలు ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందినా మైనింగ్ అండ్ జియాలజీ అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. మట్టి తవ్వకాల కోసం అనుమతి ఇచ్చినప్పుడు తరచుగా పరిశీలిస్తూ అనుమతించిన సర్వేనంబర్‌లోనే మైనింగ్ చేస్తున్నారా.. ఇంకొంత ప్రాంతానికి విస్తరించారా.. అనుమతి గడువు ఉందా, ముగిసిందా.. ఎంత మేర మట్టి తరలించారనే విషయాన్ని సంబంధిత శాఖ అధికారులు పరిశీలించాలి. అంతేకాక పని ప్రదేశంలో రక్షణ చర్యలు తీసుకున్నారా.. లేదా అని కూడా తనిఖీలు చేపట్టాలి. అగ్రిమెంట్‌లో ఏ మాత్రం తేడా ఉన్నా అనుమతి రద్దు చేసే అధికారం అధికారులకు ఉంటుంది. కానీ మట్టి అక్రమంగా తరలిపోతున్నా వారు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

ఆ క్వారీలకే అనుమతి..

జిల్లాలో ఎర్రుపాలెం మండలం రాజుపాలెం, రఘునాథపాలెం మండలం కోయచలక, ఖమ్మంరూరల్ మండలం ఆరెకోడు రెవెన్యూ పరిధిలోని క్వారీల నుంచి మాత్రమే మట్టి తరలింపునకు అనుమతులున్నాయి. మిగిలిన ఏ ప్రాంతాల నుంచి మట్టి తరలింపునకు అనుమతులు జారీ చేయలేదు. అయినా ఖమ్మం నగరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాక రఘునాథపాలెం, ఖమ్మంరూరల్, నేలకొండపల్లి, చింతకాని, ముదిగొండ.. తదితర ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు, తరలింపు ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. ఇంకొన్ని ప్రాంతాల నుంచి సైతం మట్టిని తరలిస్తూ పోలీసులకు పట్టుబడుతున్నారు. అయితే, దందా లో రూ.లక్షలు కళ్ల చూస్తుండడంతో పోలీసు కేసుల ను పెద్దగా పట్టించుకోకుండా అక్రమార్కులు తమ పని కానిచ్చేస్తున్నారు.

పేదలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి, పొంగులేటి, ఎంపీ రాఘురాంరెడ్డి



వరి పొలంలో పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్: ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలంలోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులు 36మందితో పాటు 92మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఆయన ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి చేస్తూనే హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు.

డంపింగ్ యార్డ్‌తో ఇబ్బంది ఎదురుకావొద్దు

ఖమ్మంఅర్బన్: డంపింగ్ యార్డ్ కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. ఖమ్మం 1వ డివిజన్ టీఎన్జీవోస్ కాలనీలో రూ.1.15కోట్ల వ్యయంతో డంపింగ్ యార్డుకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేసి మాట్లాడారు. డంపింగ్ యార్డులో ఎప్పటికప్పుడు చెత్త డిస్పోజ్ చేయాలన్నారు. ఈకార్యక్రమాల్లో ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్డీఓ గణేష్, తహసీల్దార్లు బి.రాంప్రసాద్, సీహెచ్.స్వామితో పాటు తేజావత్ హుస్సేన్, నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, మద్దినేని స్వర్ణకుమారి, బొర్రా రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో మంత్రి పొంగులేటి!

కల్లూరురూరల్: స్వగ్రామమైన కల్లూరు మండలంలోని నారాయణపురంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం రాత్రి బస చేయగా.. బుధవారం ఉదయమే తన వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఇంటి నుంచి కాలినడకన పొలానికి వెళ్లిన ఆయన వరి పొలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

27 వేలమంది రైతులకు రూ.28.40 కోట్లు

- వరదలతో దెబ్బతిన్న పంటలకు పరిహారం విడుదల
- ఎకరాకు రూ.10 వేల చొప్పున మంజూరు

ఖమ్మంవ్యవసాయం: గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం బుధవారం పరిహారాన్ని విడుదల చేసింది. జిల్లాలో 27,242 మంది రైతులకు చెందిన 28,407.04 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. దీంతో ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ. 28,40,71,000 పరిహారాన్ని విడుదల చేసింది. ఒకటి, రెండు రోజుల్లో ఈ నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. కాగా, భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్న జిల్లాల్లో ఖమ్మం జిల్లా మొదటి స్థానంలో ఉంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మున్నేరు, ఆకేరు, కట్టలేరు, బుగ్గవాగు, పాలేరు పొంగి ప్రవహించడంతో తిరుమలాయపాలెం మండలం రాకాసితండా, పాలేరు తదితర ప్రాంతాల్లో పంట భూముల ఆనవాళ్లు కోల్పోయాయి. ఖమ్మం రూరల్, ముదిగొండ, కూసుమంచి, బోనకల్, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, మధిర, ఎర్రుపాలెం, చింతకాని మండలాల్లో అధికంగా పంటలకు నష్టం ఏర్పడింది.

ల్యాండ్, మైనింగ్ మాఫియాపై ఉక్కుపాదం

- సిబ్బంది నిర్లక్ష్యాన్ని విడనాడాలి..
- కలెక్టర్, సీపీతో సమీక్షలో మంత్రి తుమ్మల



కలెక్టర్, సీపీతో సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: భూఅక్రమాలు, మైనింగ్ మాఫియాకు పాల్పడుతున్న వారే కాక గంజాయి రవాణా, అమ్మకందారులపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ విషయంలో కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం విడనాడేలా పర్యవేక్షించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్‌కు ఆయన సూచించారు. ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్, సీపీ, అదనపు కలెక్టర్ మధుసూదన్‌తో సమావేశమైన మంత్రి మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలం జింకలతండా తండా వద్ద 22 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌కు 11వ తేదీన శంకుస్థాపన చేయనుండగా ఏర్పాట్లు పూర్తిచేయాలని తెలిపారు. నియోజకవర్గంలోని 50 మసీద్‌లకు రూ.50లక్షల నిధులు తక్షణమే కేటాయించాలని, అక్షయపాత్ర సంస్థకు భూమి గుర్తించాలని సూచించారు. అంతేకాక ఖమ్మంలో డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపాలని మంత్రి తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

రఘునాథపాలెం/ఖమ్మం వన్‌టౌన్: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాలతో పాటు ఖమ్మం 20వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి మాట్లాడారు. నిరుపేదలకు తొలిదశలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాల్సి ఉంటుందని తెలిపారు. సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాల జాబితా సమర్పించాలని సూచించారు. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీఈ మహేష్, ఏఈ చిరంజీవి, ఎంపీడీఓ అశోక్‌తో పాటు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గుత్తా వెంకటేశ్వర్లు, మలీదు జగన్, తాతా రఘురాం, కరుణాకర్‌రెడ్డి, దీపక్, తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు, ప్రశాంతలక్ష్మి, కమర్తపు మురళి, రావూరి సైదుబాబు, అంజిరెడ్డి, పాలకుర్తి నాగేశ్వరరావు, చోటేబాబా తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న అనుబంధం!

- పొరుగు రాష్ట్రమైనా బతుకమ్మపై మక్కువ
- ఇతర రాష్ట్రాలకు కోడళ్లుగా వెళ్లిన వారూ రావాల్సిందే...
- సంస్కృతి, సంప్రదాయంలో భాగమని భావన
- బంధుత్వం, స్నేహాన్ని వీడలేక కలుస్తున్న ఆడబిడ్డలు

తెలంగాణ ఆడబిడ్డలు జరుపుకునే పండుగల్లో బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉంది. పూలను పూజించే పండుగ ప్రపంచంలో ఇదొక్కటే కావడం.. తెలంగాణలో మాత్రమే జరుపుకుంటుండడం విశేషం. తెలంగాణ ఏర్పడి బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించాక ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పండుగకు మరింత ప్రాముఖ్యత ఏర్పడింది. ప్రస్తుతం బతుకమ్మ చివరి అంకానికి చేరింది. అయితే, ఈ పండుగకు ఎక్కడెక్కడో ఉన్న ఆడబిడ్డలు పుట్టింటికి చేరడం ఆనవాయితీగా వస్తోంది. విదేశాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఆడబిడ్డలు కూడా రానుండడం ఓ విశేషమైతే.. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు కోడళ్లుగా వచ్చిన అతివలు సైతం బతుకమ్మపై మక్కువ పెంచుకుని సద్దులకు సిద్ధమవుతుండడం మరో విశేషం. ఈ నేపథ్యాన నేడు(గురువారం) సద్దుల బతుకమ్మ సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి రానున్న ఆడబిడ్డలు.. ఇతర రాష్ట్రాల నుంచి కోడళ్లుగా వచ్చిన అతివల అభిప్రాయాలతో కథనం. – ఖమ్మంగాంధీచౌక్



ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో బతుకమ్మ ఆడుతున్న డీఆర్‌డీఏ ఉద్యోగులు, మహిళలు

వైభవంగా జరుపుకుంటాం..



మా స్వస్థలం రాజమండ్రి. 2014లో ఖమ్మం వాసి నవీన్‌తో పెళ్లయింది. అప్పుడే తెలంగాణ ఏర్పడగా, తొలుత పండుగ ప్రత్యేకత తెలియకున్నా సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని తెలుసుకున్నా. అందుకే ఏటా బతుకమ్మ ఇక్కడే ఘనంగా నిర్వహిస్తాం.

– యమున, విజయనగర్ కాలనీ, ఖమ్మం

ఎప్పుడూ అమ్మ దగ్గరకే..



చిన్నతనం నుంచి బతుకమ్మ అంటే ఇష్టం. వివాహం అయ్యాక పదహారేళ్లుగా విజయవాడలో ఉంటున్నాం. అయినా ఏటా బతుకమ్మ పండుగకు మాత్రం ఖమ్మం రావాల్సిందే. పుట్టింట్లో బతుకమ్మ పండుగ జరుపుకోవటం మరిచిపోలేని అనుభూతి.

– దైత శ్రీలక్ష్మి, గట్టయ్య సెంటర్, ఖమ్మం

ఏటా పుట్టింట్లోనే బతుకమ్మ..



ఉద్యోగరీత్యా అమెరికాలోని డల్లాస్‌లో ఉంటున్నాం. ఏటా బతుకమ్మకు ఖమ్మం వస్తాం. అమ్మవారి ఇంట్లో బంధువులు, స్నేహితులతో కలిసి ఎంగిలి పూలు మొదలు సద్దుల వరకు వేడుకగా జరుపుకుంటాం. దసరా పూర్తయ్యాక అమెరికా వెళ్తాం.

– విదాల నిఖిత, పీఎస్ఆర్ రోడ్డు, ఖమ్మం

ఆటపాటల పండుగ..



గుంటూరు జిల్లా తెనాలి పుట్టిల్లు. ఖమ్మం అత్తగారిల్లు. నాకు పెళ్లయి 27 ఏళ్లు అవుతున్నా బతుకమ్మ పండుగకు మాత్రం ఎప్పుడూ తెనాలి వెళ్లలేదు. ఖమ్మంలోనే కుటుంబీకులు, స్నేహితులు, బంధువులు కలిసి బతుకమ్మ పేర్చి ఆటపాటలతో సరదాగా గడుపుతాం.

– తూములూరి శివకుమారి, దాబాల బజార్, ఖమ్మం

అత్తవారింట్లోనే ఆనందంగా..



ఏపీలోని జంగారెడ్డిగూడెం మా పుట్టిల్లు. ఖమ్మంకు చెందిన గోళ్ల నర్సింహారావుతో వివాహం జరిగింది. సంక్రాంతి, దీపావళికి పుట్టింటికి వెళ్లినా బతుకమ్మకు మాత్రం ఇక్కడే ఉంటా. సంప్రదాయంగా బతుకమ్మ జరుపుకోవడం ఆనందంగా ఉంటుంది.

– గోళ్ల పుష్కరిణి, గుట్టలబజార్, ఖమ్మం

అందరం కలిసే సంప్రదాయం



మా పుట్టినిల్లయిన ఏపీలోని అమరావతిలో బతుకమ్మ జరుపుకోరు. ఇక్కడ మాత్రం సంప్రదాయంగా నిర్వహిస్తారు. ఈ పండుగ ద్వారా స్నేహ సంబంధాలు పెరుగుతాయి. స్నేహితులు, బంధువులు కలిసే ఈ పండుగను ఏటా సంబురంగా జరుపుకుంటాం.

– తూపల్లి అనూష, త్రీటౌన్, ఖమ్మం

నకిలీ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న డీటీసీ పుప్పాల శ్రీనివాస్

ఖమ్మంక్రైం: నకిలీ పత్రాలతో తీసుకున్న బీమా ద్వారా వాహనాల రిజిస్ట్రేషన్లు చేయిస్తుండడంతో పాటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందుతున్న వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించామని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాలతోపాటు చెక్‌పోస్టులను రెండు రోజులుగా తనిఖీ చేస్తున్న ఆయన బుధవారం ఖమ్మంలో మాట్లాడారు. అన్నిపత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే రిజిస్ట్రేషన్ చేయాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. అలాగే, కార్యాలయాల్లో ఏజెంట్ల కట్టడికి ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. వాహనదారులు 18రకాల సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందొచ్చని తెలిపారు. ఉద్యోగుల కొరత ఉన్నా ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో 101 శాతం ఆదాయం నమోదు కావడంతో ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వెంకటరమణతోపాటు ఉద్యోగులను డీటీసీ అభినందించారు. ఇక శిక్షణ పూర్తిచేసుకుంటున్న ఏఎంవీఐలు వస్తే ఉద్యోగుల కొరత తీరుతుందని తెలిపారు. కాగా, గర్భిణులు, చంటిపిల్లలతో వచ్చే మహిళల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఈసమావేశంలో ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వెంకటరమణ, ఏఓ జహీద్‌అలీ ఏఎంవీఐ స్వర్ణలత తదితరులు,పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెడికల్ కాలేజీలో కొనసాగుతున్న కౌన్సెలింగ్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మంగళవారం మొదలైన రెండో విడత కౌన్సెలింగ్ కొనసాగుతోంది. మొదటి విడత కౌన్సెలింగ్ రాష్ట్ర కోటాలో 65 సీట్లు భర్తీ కాగా, రెండో విడతకు వచ్చేసరికి 15 మంది స్లైడింగ్‌లో భాగంగా ఇతర కళాశాలలకు వెళ్లారు. కాగా మంగళవారం ఐదుగురు, బుధవారం 19 మంది ప్రవేశాలు పొందారు. దీంతో ఇప్పటివరకు రాష్ట్ర కోటాలో 74 మంది చేరినట్లయింది. రాష్ట్ర కోటాలో 85 సీట్లు, జాతీయ కోటాలో 15 సీట్లు భర్తీ కావాల్సి ఉండగా జాతీయ కోటాలో 12 మంది చేరారు. ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగే కౌన్సెలింగ్‌లో మొత్తం 100 సీట్లు భర్తీ అయ్యే అవకాశముందని ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు.

టెన్నిస్ టోర్నీలో ప్రతిభ


సతీశ్, రామారాయులను అభినందిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 18వ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో ఖమ్మం కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీఐ సతీశ్ - ఎం.రామారాయులు ప్రతిభ చాటారు. 30 ఏళ్ల విభాగంలో రన్నర్‌గా నిలవగా సీపీ సునీల్‌దత్ బుధవారం వారిని అభినందించారు.

జాతీయస్థాయి జట్టులో స్థానం


క్రీడాకారులతో పీఈటీలు

ఖమ్మంస్పోర్ట్స్/ముదిగొండ: రాష్ట్ర పాఠశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన మెదక్‌లో జరిగిన అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా జట్టులో సత్తా చాటిన వీవీ పాలెం పాఠశాలకు చెందిన యువవర్షిణి, మేడేపల్లికి చెందిన అనూషను జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఈ మేరకు క్రీడాకారులను డీఈఓ సోమశేఖరశర్మ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె.నర్సింహమూర్తి, పీడీ శ్రీనివాస్, ఫుట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు కె.ఆదర్శ్‌కుమార్, బి.కృష్ణయ్య అభినందించారు.

చెట్ల నరికివేత పనులతో ట్రాఫిక్‌కు అంతరాయం

రఘునాథపాలెం: ఖమ్మం - ఇల్లెందు ప్రధాన రహదారిపై రఘునాథపాలెం మండలంలో రోడ్డు విస్తరణ కోసం ఇరువైపులా ఉన్న చెట్లు నరికివేస్తున్నారు. అయితే, బుధవారం కామేపల్లి మండలం పండితాపురంలో సంత జరుగుతుండడం.. పెద్దసంఖ్యలో వాహనాలు వచ్చివెళ్తున్న నేపథ్యాన చెట్లు నరికివేస్తుండటంతో కొమ్మలు రహదారిపై పడగా తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డుకు ఇరువైపులా కి.మీ. మేర వాహనాలు నిలిచిపోవడంతో సీఐ ఉస్మాన్‌షరీఫ్, సిబ్బందితో చేరుకుని క్రమబద్ధీకరించారు. చెట్లు నరికే సమయాన సంబంధిత కాంట్రాక్టర్ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు చేపడితే సమస్య ఏర్పడేది కాదని పలువురు తెలిపారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు


మార్చురీ వద్ద మృతదేహాలతో అన్నం శ్రీనివాసరావు తదితరులు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కన్నుమూసిన వారి మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. అయితే, ఈ మృతదేహాల కోసం ఎవరూ రాకపోవడంతో ఓపీ పోలీసులు, వైద్యశాల సిబ్బంది అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆరు అనాథ మృతదేహాలను బల్లేపల్లి వైకుంఠధామానికి తరలించి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు అన్నం అమరేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,300	6,600
మిర్చి	18,600	9.500
మిర్చి తాలు	9,400	7,000
ఏసీ మిర్చి	19,700	10,000
ఏసీ తాలు	9,600	7,000
కొత్త పత్తి	6,900	6,000
పాత పత్తి	7,400	7,400

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.17,043

పండుగ వేళ ప్రతిన బూనుదాం

- గంజాయి నిర్మూలనే అందరి లక్ష్యం కావాలి
- సరదాగా మొదలుపెట్టి బానిసలుగా మారుతున్న యువత
- తల్లిదండ్రులు తొలిదశలోనే గుర్తిస్తే కట్టడి సులువు



సత్తుపల్లి: సత్తుపల్లి ప్రశాంతతకు మారుపేరుగా ఉండేది. కోల్‌బెల్ట్ ఏరియాకు తోడు విద్యాసంస్థల ఏర్పాటుతో అభివృద్ధిలో దూసుకెళ్తుండగా యువత మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారని.. గంజాయి ఊబిలో కూరుకుపోతున్నారని ఇటీవల పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో సత్తుపల్లి వాసులు ఉలిక్కిపడ్డారు. విద్యార్థులు, యువత తరచూ ఘర్షణ పడటం.. ప్రశాంతతను దెబ్బతీసేలా ఘటనలు జరుగుతుండటం వారి ఆందోళనకు కారణమవుతుతోంది. మత్తులో జోగుతూ మితిమీరిన వేగంతో బైక్‌లు నడిపి ప్రమాదాలకు కారణమవుతుండటం దృష్టిపెట్టాల్సిన అంశం. ఈ మేరకు గంజాయి కట్టడికి పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నప్పటికీ తల్లిదండ్రులు కూడా పిల్లలపై కన్నేసి ఉంచాలని సూచిస్తున్నారు. ఈ మేరకు దసరా పండుగ సందర్భంగా ప్రతీ ఒక్కరూ గంజాయి కట్టడిలో భాగమవుతామని ప్రతిన బూనితే సత్ఫలితాలు వచ్చే అవకాశముంది.

తక్కువ ఖర్చుతోనే..

ఆల్కాహాల్ మోతాదుకంటే మత్తు ఎక్కువ ఇస్తుండడం, తక్కువ ఖర్చుతో ఎక్కువ మత్తు రావటంతో యువత అలవాటు గంజాయికి పడుతున్నట్లు తెలిసింది. రూ.వంద కే గంజాయి దొరుకుతున్నట్లు తెలిసింది. సిగరెట్లలో గంజాయిని కూర్చి పీలుస్తూ మత్తులో జోగుతున్నారు. స్లమ్ ఏరియాలను ఎంచుకొని కొందరు గంజాయి సరఫరా చేస్తున్నట్లు సమాచారం. చదువు మధ్యలోనే మానేసిన వారు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులే గంజాయి క్రయవిక్రయాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పోలీసులు కొరడా ఝుళిపించి..

గంజాయి క్రయవిక్రయాలపై పోలీసులు కొరడా ఝుళిపించటంతో గంజాయి పేరు ఎత్తటానికే జంకుతున్నారు. గంజాయి విక్రేతలను ఇప్పటికే అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేయటం, వారు ఇచ్చిన సమాచారంతో మరికొందరిని పిలిపించి నయానో.. భయానో.. గంజాయి బారిన పడకుండా యువతకు కౌన్సెలింగే ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. పోలీసులు వివిధ కోణాల్లో విశ్లేషణ చేసి గంజాయి రహిత సత్తుపల్లిగా మార్చేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు ఉండటంతో పోలీసులకు మరింత వెసులుబాటు వచ్చినట్లైంది. గంజాయికి బానిసలైన వారిలో తమదైన కౌన్సెలింగ్‌తో మార్పు తేవాలనే ఆలోచనతో ముందుకెళ్తున్నారు.

తల్లిదండ్రులు ముందుగా గుర్తిస్తే మేలు..

గంజాయి, డ్రగ్స్, బోనోఫిక్స్ మత్తు పీల్చుతూ యువత, విద్యార్థులు పెడదోవపడుతున్నారనే ఆందోళన వ్యక్తపరిచే తల్లిదండ్రులు తమ పిల్లలను పట్టించుకోక పోవటం వల్లే ఈ రుగ్మత విస్తరించిందని పోలీసులు బలంగా భావిస్తున్నారు. చెడు వ్యసనాలకు లోనవుతున్నారని, తల్లిదండ్రులే ముందుగా గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, పిల్లల అతి గారాబమే చెడు వ్యసనాలకు కారణమని తెలుస్తోంది. పిల్లలు చెప్పినట్లు పాకెట్‌మని ఇవ్వటం, హైస్పీడ్ వాహనాలు ఇవ్వటం, కళాశాలకు సమయానికి వెళ్తున్నారా.. లేదా.. స్నేహితుల ప్రభావం ఎలా ఉందనే విషయాలపై ఆరా తీయకపోవటం వల్లే మాదక ద్రవ్యాల మత్తుకు అలవాటుపడుతున్నారని విచారణలో తేలింది. దూర ప్రాంతాల నుంచి విద్య కోసం వచ్చిన విద్యార్థులపై సరైన నిఘా లేకపోవటం కూడా మత్తుకు కారణంగా చెప్పవచ్చు. ఇప్పటికైనా తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలను ఓ కంటకనిపెడుతూ అవసరమైతే కౌన్సెలింగ్ ద్వారా మార్పు తీసుకురావాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

సిగరెట్‌తో సరదాగా మొదలై..

సరదాగా సిగరేట్‌తో మొదలైన వ్యసనం క్రమంగా గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడుతున్నారని పోలీసుల విచారణలో తేలింది. విద్యార్థులు, యువత గంజాయి వాడకంపై వస్తున్న సమాచారాన్ని మొదట్లో అంత సీరియస్‌గా తీసుకోక పోవటంతో రెండు మూడేళ్లల్లోనే గంజాయి వాడకం విస్తరించినట్లు తెలిసింది. దీనికితోడు మత్తును కలిగించే బోనోఫిక్స్ (చెప్పులు, ఎలక్ట్రికల్, ప్లాస్టిక్ వస్తువులను అతికించేందుకు వినియోగించే) లాంటి మత్తు కలిగించేవాటికి యువత, విద్యార్థులు బానిసలవుతున్నట్లు తెలిసింది.

గంజాయిని సమూలంగా నిర్మూలిస్తాం..



గంజాయి నియంత్రణపై కఠినంగా వ్యవహరించి ఆటకటిస్తాం. గంజాయి క్రయవిక్రయాలపై నిఘా పెట్టాం. అమ్మేవారు.. తాగేవారు, కొనుగోలు చేసేవారు శిక్షార్హులే. నిర్దిష్ట సమాచారం పోలీసులకు అందిస్తే వివరాలను గోప్యంగా ఉంచుతాం. మాదక ద్రవ్యాల బారినపడిన వారిని తల్లిదండ్రులు ముందుగా గుర్తిస్తే అవసరమైతే కౌన్సెలింగ్ ఇచ్చి మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తాం. చైన్‌లింక్‌తో విచారణను వేగవంతం చేస్తున్నాం. గంజాయి రహిత సత్తుపల్లిగా చేసేందుకు సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్, పోలీస్ సిబ్బంది నిరంతరం పనిచేస్తున్నారు.

–అనిశెట్టి రఘు, ఏసీపీ, కల్లూరు

15 నుంచి సీఎం కప్ టార్చ్ ర్యాలీ


మాట్లాడుతున్న డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్: త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా టార్చ్ ర్యాలీని ఉమ్మడి జిల్లాలో ఈ నెల 15 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా సంఘాల సమీక్ష సమావేశం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం జరగగా వివరాలను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో ఈ నెల 15న మొదలయ్యే టార్చ్ ర్యాలీ విజయవంతానికి క్రీడా సంఘాలు సహకరించాలని కోరారు. తొలుత భద్రాద్రి కొత్తగూడెంనకు చేరుకునే ర్యాలీ కొత్తగూడెం, సుజాతనగర్, జూలురుపాడు చేరుకుంటుందని.. ఆపై ఏన్కూరు వద్ద ఖమ్మం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్వీకరించి కొణిజర్ల, వెంకటాయపాలెం నుంచి కలెక్టరేట్, కమిషనరేట్ కార్యాలయానికి చేరుకుంటుందని తెలిపారు. ఆపై వరంగల్ జిల్లాలోకి వెళ్తుందని చెప్పారు. టార్చ్ ర్యాలీకి క్రీడాకారులు ఘన స్వాగతం పలికేలా తరలిరావాలని సూచించారు. వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పుట్టా శంకరయ్య, గోవింద్‌రెడ్డి, క్రిస్టోఫర్‌బాబు, ఉప్పల్‌రెడ్డి, షఫీక్ అహ్మద్, పరిపూర్ణాచారి, స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు ఎండీ గౌస్, ఎండీ అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అంకురలో అధునాతన వైద్యసౌకర్యాలు

ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల, పక్కన యాజమాన్యం


నూతన విభాగాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవైద్యవిభాగం: అత్యుత్తమ, ఆధునాతన సేవలు అందించేలా అంకుర ఆస్పత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం గొరిల్లా పార్క్, సీక్వెల్ రిసార్ట్ సమీపాన నూతన భవనంలో ఏర్పాటు చేసిన ఆస్పత్రిని బుధవారం మంత్రులు, ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్యసేవల్లో ఖమ్మం జిల్లాకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, హైదరాబాద్ తర్వాత అంతటి కీర్తిని సొంతం చేసుకున్న ఖమ్మంలో అంకుర ఆస్పత్రి ద్వారా వ్యాపార దృక్పథంతో చూడకుండా సేవలు అందిస్తుండటం అభినందనీయమని చెప్పారు. అనంతరం అంకుర ఆస్పత్రి వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వున్నం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. అన్ని బ్రాంచ్‌లలో మొత్తం 1,800 పడకలు ఉండగా, ఏళ్లుగా ఖమ్మంలో విశిష్ట సేవలు అందిస్తున్న తాము నూతన భవనంలో 120 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దామని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్నామని చెప్పారు. తమ ఆస్పత్రిలో 3ఎం ఫెర్టిలిటీ సౌకర్యం ఉండగా, సంతానోత్పత్తి విషయంలో ప్రపంచ సగటును మించి విజయాలు నమోదవుతున్నాయని తెలిపారు. అంకుర ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ చల్లగుళ్ల, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మువ్వా విజయబాబు, రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మేయర్ పి.నీరజ, డీఎంహెచ్‌ఓ వి.సుబ్బారావు, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, క్లస్టర్ మెడికల్ హెడ్ డాక్టర్ దుర్గాప్రసాద్, మెడికల్ డైరెక్టర్ సందీప్‌రెడ్డితో పాటు కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'సిల్వర్ పారడైజ్' ప్రారంభం


సిల్వర్ పారడైజ్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యాజమాన్యం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలో సుహాస్ జ్యూయెలరీని ప్రారంభించి బుధవారంతో ఐదేళ్లు పూర్తి కాగా.. సిల్వర్ పారడైజ్ పేరిట ప్రత్యేక షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా దుగ్గి సుహాస్ - సంతోషి, సాహితి జ్యోతిప్రజ్వలన చేయగా సుహాస్ జ్యూయెలరీస్ అధినేత దుగ్గి సతీష్‌కుమార్ మాట్లాడారు. తమ సంస్థ ఏర్పాటై ఐదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా పక్కనే సిల్వర్ పారడైజ్‌ను ప్రారంభించామని తెలిపారు. ప్రత్యేక ఆఫర్‌గా అన్ని వస్తువులపై 5.9 శాతం నుంచి 11.9 శాతం మాత్రమే తరుగు ఉంటుందని, ఈ ఆఫర్‌ను 29వ తేదీ వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అలాగే, ప్రతీ కొనుగోలు పై కూపన్ ఇస్తామన్నారు. ఇందులో విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులుగా 50 గ్రాములు, 20 గ్రాములు, 10 గ్రాముల బంగారం, నాలుగు, ఐదో విజేతలకు 100 గ్రాములు, 50 గ్రాముల వెండి గెలుపొందే అవకాశం ఉందని తెలిపారు. అంతేకాక ప్రతీ రూ.లక్ష కొనుగోలుపై ఇచ్చే రూ.500 వెండి కూపన్‌తో సిల్వర్ పారడైజ్‌లో వెండి వస్తువుల కొనుగోళ్లపై తగ్గింపు ఉంటుందని ఆయన వివరించారు.

సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంసహకారనగర్: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ నిలుస్తోందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ.. అధికారులు, ఉద్యోగులతో కలిసి బతుకమ్మ వద్ద పూజలు చేశారు. అనంతరం వారితో కలిసి నృత్యాలు చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఆర్‌డీఓ సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో పాటు పెద్దసంఖ్యలో స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాల ఆధ్వర్యాన..

ఖమ్మంక్రైం: పోలీసు ఉద్యోగుల కుటుంబాల ఆధ్వర్యాన బుధవారం రాత్రి పోలీస్ పరేడ్ మైదానంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. రంగు రంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మల వద్ద సీపీ సునీల్‌దత్, ఆయన సతీమణి నిషితశర్మ పూజలు చేశారు. ఆ తర్వాత కోలాటాలు వేస్తూ ఆడిపాడారు. అడిషనల్ డీసీపీలు నరేశ్‌కుమార్, ప్రసాద్‌రావు, ఏసీపీలు రవి, సాంబరాజు, నర్సయ్య, ఆర్‌ఐలు కామరాజు, శ్రీశైలం, సురేశ్, ఏఓ అక్తరున్నీసా బేగం, సీఐలు రాజిరెడ్డి, సతీశ్, ఉదయ్‌కుమార్, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ వద్ద కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు


పూజలు చేస్తున్న సీపీ సునీల్‌దత్, ఆయన సతీమణి నిషితశర్మ, పక్కన ఉద్యోగులు

ప్రతీ నియోజకవర్గంలో సమీకృత గురుకులం

- రేపు మూడుచోట్ల శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం, మంత్రులు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


ఉద్యోగులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

రఘునాథపాలెం/ఖమ్మంరూరల్: ప్రతీ నియోజకవర్గంలో ఒక సమీకృత గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. అందులో భాగంగా తొలిదశలో ఈ నెల 11న మూడు నియోజకవర్గాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించి రఘునాథపాలెం మండలం జింకలతండా వద్ద, పాలేరు నియోజకవర్గంలో పొన్నేకల్ వద్ద ఎంపిక చేసిన స్థలాలను కలెక్టర్ బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలతో పాటు మధిర నియోజకవర్గానికి సంబంధించి బోనకల్ మండలం లక్ష్మీపురంలో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల సముదాయాలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ నెల 11న ఉదయం 9 గంటలకు పొన్నెకల్‌లో, 11 గంటలకు లక్ష్మీపురంలో, మధ్యాహ్నం 2 గంటలకు జింకలతండాలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ మేరకు వేదికల నిర్మాణం, ఎల్‌ఈడీ ప్యానళ్లు, తాగునీరు సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్‌శ్రేష్ఠ, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ బి.హేమలత, డీఈఓ సోమశేఖరశర్మ, మైనింగ్ ఏడీ సాయినాథ్, ఆర్‌అండ్‌బీ ఈఈ యుగంధర్, ఎంఈఓ రాములు, తహసీల్దార్ పి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో స్థలపరిశీలన

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్)లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న స్థలాన్ని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. తహసీల్దార్ పున్నం చందర్ నేతృత్వాన స్థలాన్ని పరిశీలించగా, కలెక్టర్ ఆదేశాలతో అదనపు భూమి సేకరణకు సర్వేయర్ కృష్ణమూర్తితో సర్వే చేయించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ తానేశ్వర్, డీఈ శంకర్‌రావు, ఏఈ శ్రీకాంత్, డీపీఓ ఆశాలత, డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ రవికుమార్, ఎంపీఓ శాస్త్రి, ఎంఈఓ పుల్లయ్య, ఆర్‌ఐలు లక్ష్మణ్, రమాదేవి పాల్గొన్నారు.

కాల్వ పనులను పరిశీలించిన సీఈ


పనులపై ఆరా తీస్తున్న సీఈ విద్యాసాగర్

కూసుమంచి: మండలంలోని పాలేరు వద్ద సాగర్ ఎడమ కాల్వ యూటీ సమీపాన జరుగుతున్న పనులను జలవనరుల శాఖ సీఈ విద్యాసాగర్ బుధవారం పరిశీలించారు. యూటీ తొలగించడంతో కాల్వ కట్టకు ఆవలి వైపు నిలిచిన నీటిని భారీ మోటార్ల ద్వారా తోడి కాల్వలోకి విడుదల చేస్తున్నారు. అంతేకాక భారీ వరదలతో కాల్వ కట్టలు తెగిపోగా పటిష్టం చేసేలా పనులు చేపట్టారు. పనులను పరిశీలించిన సీఈ అక్కడి ఉద్యోగులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ నర్సింగరావు, ఈఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమించిన పెద్దాస్పత్రి కార్మికులు

- మూడు నెలల వేతనాలు ఇప్పిస్తామనే హామీతో విధుల్లోకి..


మున్సిపల్ కార్మికులను అడ్డుకుంటున్న పెద్దాస్పత్రి కార్మికులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని పారిశుద్ధ్య కార్మికులు సమ్మె విరమించారు. నాలుగు రోజుల్లోగా మూడు నెలల వేతనాలు ఖాతాల్లో జమ చేయిస్తామనే హామీతో బుధవారం సాయంత్రం విధుల్లో చేరారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో సోమవారం నుంచి పెద్దాస్పత్రిలోని పారిశుద్ధ్య కార్మికులు సమ్మెకు దిగిన విషయం విదితమే. దీంతో బయోవ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకుపోవడమే కాక మరుగుదొడ్లు శుభ్రం చేయక దుర్వాసన వెదజల్లుతోంది. బుధవారం మున్సిపల్ కార్మికులను పిలిపించినా పేషంట్ కేర్, సెక్యూరిటీ, స్వీపర్లు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత నెలకొనగా పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో మధ్యాహ్నం సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ కార్మికులతో చర్చించి సోమవారం నాటికి మూడు నెలల జీతం వచ్చేలా చూస్తామని, తొలుత రూ.5 వేలు ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో విధుల్లో చేరారు. ఆపై బయోవ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించి మరుగుదొడ్లు శుభ్రం చేయడంతో పూర్వ పరిస్థితులు నెలకొన్నాయి.

రైలులో సీఐఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ మృతి

ఖమ్మంక్రైం: రైలులో ప్రయాణిస్తున్న సీఐఎస్ఎఫ్(సెంట్రల్ ఇండ్రస్టీయల్ సెక్యూరిటీ ఫోర్స్) హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందాడు. రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రంలో వైజాగ్‌కు చెందిన సీఐఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ జి.సత్యనారాయణమూర్తి(55) విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన స్వస్థలానికి వెళ్లేందుకు ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరగా రైలు వరంగల్ దాటాక అస్వస్థతకు గురయ్యాడు. దీంతో సీపీఆర్ చేసిన సహచర ప్రయాణికులు ఇచ్చిన సమాచారంతో ఖమ్మంలో రైలు ఆపారు. అప్పటికే జీఆర్‌పీ ఎస్ఐ భాస్కర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ 108 వాహనంతో సిద్ధంగా ఉండగా స్పృహ కోల్పోయిన మూర్తిని జిల్లా ఆస్పత్రికి తరలించేసరికి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబీకులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.



చిన్ననాటి రతన్ టాటా (ఎడమవైపు)


జేఆర్‌డీ టాటాతో రతన్


ప్రధాని మోదీతో రతన్ టాటా


2008లో నాటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ చేతులమీదుగా పద్మవిభూషణ్ అందుకుంటున్న రతన్ టాటా


ఎఫ్18, ఎఫ్16 యుద్ధవిమానాల్లో ప్రయాణిస్తున్న రతన్



రతనాల మాట..

జీవితంలో ఎత్తు, పల్లాలు ఉండాల్సిందే. కొన్ని సార్లు స్ట్రెయిట్ లైన్ కూడా బాగుండదు. ఈసీజీ రిపోర్ట్‌లో సరళ రేఖ వచ్చిందంటే మనం బతికిలేమని అర్థం

వాస్తవిక ప్రపంచంలో వస్తువులు ఎందుకూ పనికిరావని ఏదో ఒకనాడు మనం అర్థం చేసుకుంటాం. అన్నింటికంటే ప్రేమే ముఖ్యమని గ్రహిస్తాం

ఉత్తమమైన లీడర్ ఎవరంటే.. వాళ్లకంటే అత్యంత తెలివిగా వ్యవహరించే అనుచరులు, సహాయకులను చుట్టూతా పెట్టుకున్న వాళ్లే.

వృత్తిజీవితానికి, వ్యక్తిగత జీవితానికి మధ్య సమతుల్యత సాధించడం మీద నాకు పెద్దగా నమ్మకం లేదు. వృత్తిని, జీవితాన్ని సమ్మిళితం చేసుకోవడమే నాకిష్టం. పని, జీవితాన్ని అత్యంత అర్థవంతంగా మార్చుకోండి

జీవితంలో పెద్ద రిస్క్ ఏంటంటే రిస్క్‌ను తీసుకోకపోవడమే. క్షణక్షణం మారే ప్రపంచంలో రిస్కులు తీసుకోలేదంటే మనం ఫెయిల్ అయిపోతాం

నిరంతరం హుషారుగా ఉండండి. అప్పుడే విజయం మీ వశమవుతుంది

ఇతరులతో సంభాషించేటప్పుడు దయ, సహానుభూతి, కరుణతో మెలగండి. వాటిని తక్కువ అంచనా వేయొద్దు

నాయకత్వం అనేది బాధ్యత తీసుకోవడం మాత్రమే. సాకులు చెప్పడం కాదు

అవకాశాలు మీ చెంతకు వస్తాయని వేచి చూడొద్దు. మీరే వాటిని సృష్టించుకోండి

ఎల్లప్పుడూ సుఖప్రదమైన జీవితం మీకు ఉండకపోవచ్చు. అలాగే ప్రపంచ సమస్యలు అన్నింటినీ మీరు పరిష్కరించలేకపోవచ్చు. కానీ మీ ప్రాధాన్యాన్ని మీరు తక్కువగా అంచనావేయొద్దు. ధైర్యం అనేది ఒక అంటువ్యాధిలా వ్యాపించేది. ఆశ జీవితాన్ని నిలబెడుతుంది.

- రతన్ టాటా


నానో కారు ఆవిష్కరణలో...

అనితర సాధ్యుడు..

పుట్టిన తేదీ, స్థలం: 1937 డిసెంబర్ 28, ముంబై (అప్పట్లో బాంబే)
విద్యాభ్యాసం: కార్నెల్ యూనివర్సిటీ (బీఆర్క్)
తల్లిదండ్రులు: నావల్ టాటా, సూనూ టాటా
పురస్కారాలు: పద్మవిభూషణ్ (2008), మహారాష్ట్ర భూషణ్ (2006), పద్మభూషణ్ (2000)

బాల్యం..విద్యాభ్యాసం..

పారిశ్రామిక దిగ్గజం, వితరణ శీలి రతన్ టాటా చాలా సాధారణ జీవితం గడిపేవారు. ఆయన 1937 డిసెంబర్ 28న ముంబైలో జన్మించారు. టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జంషెడ్‌జీ టాటా కుమారుడు రతన్‌జీ టాటా దత్తత తీసుకున్న నావల్ టాటా, సూనూ టాటా ఆయన తల్లిదండ్రులు. 1948లో ఆయన తల్లిదండ్రులు విడిపోవడంతో రతన్‌జీ టాటా సతీమణి అయిన నవాజ్‌బాయ్ టాటా సంరక్షణలో పెరిగారు. జిమ్మీ టాటా ఆయనకు సోదరుడు కాగా, నోయెల్ టాటా సవతి సోదరుడు. రతన్ టాటా ముంబై, సిమ్లాలో విద్యాభ్యాసం చేశారు. అటుపైన అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చదివారు.

100 బిలియన్ డాలర్లకు టాటా గ్రూప్..

రతన్ టాటా 1962లో టాటా సన్స్‌లో చేరారు. సాధారణ ఉద్యోగి తరహాలోనే పని చేస్తూ కుటుంబ వ్యాపార మెళకువలు తెలుసుకోవడంలో నిమగ్నమయ్యారు. ఆర్థిక సమస్యల్లో ఉన్న నేషనల్ రేడియో అండ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ (నెల్కో)కి డైరెక్టర్ ఇంచార్జ్‌గా 1971లో ఆయన నియమితులయ్యారు. కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగాన్ని గాడిలో పెట్టేందుకు తీవ్రంగా శ్రమించినప్పటికీ, ఆర్థిక మందగమనం, కార్మిక సంఘాలపరమైన సమస్యల కారణంగా ఆ ప్రయత్నాలు అంతగా సఫలం కాలేదు. 1977లో సంక్షోభంలో ఉన్న మరో గ్రూప్ సంస్థ ఎంప్రెస్ మిల్స్‌కి ఆయన బదిలీ అయ్యారు. మిల్లును పునరుద్ధరించేందుకు ఆయన ప్రణాళికలు వేసినప్పటికీ మిగతా అధికారులు కలిసి రాకపోవడంతో సంస్థను అంతిమంగా మూసివేయాల్సి వచ్చింది. మొత్తానికి 1991లో జేఆర్‌డీ టాటా ఆయన్ను టాటా గ్రూప్ చైర్మన్‌గా నియమించారు. భారీ బాధ్యతలను మోయడంలో ఆయనకున్న సామర్థ్యాలపై సందేహాల కారణంగా మిగతా అధికారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ రతన్ టాటా వాటన్నింటినీ తోసిరాజని తన సత్తా నిరూపించుకున్నారు. గ్రూప్‌ను అగ్రగామిగా నిలిపారు. తన హయాంలో మేనేజ్‌మెంట్ తీరుతెన్నులను పూర్తిగా మార్చేసి గ్రూప్ కంపెనీలను పరుగులు తీయించారు. 2012లో ఆయన టాటా గ్రూప్ చైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత చైర్మన్‌గా నియమితులైన సైరస్ మిస్త్రీతో విభేదాలు రావడంతో తిరిగి 2016 అక్టోబర్ నుంచి 2017 ఫిబ్రవరి వరకు మరోసారి చైర్మన్ బాధ్యతలు చేపట్టారు. అటు తర్వాత ఎన్.చంద్రశేఖరన్‌కు పగ్గాలు అప్పగించారు. 21 సంవత్సరాల పాటు సాగిన రతన్ టాటా హయాంలో గ్రూప్ ఆదాయాలు 40 రెట్లు, లాభాలు 50 రెట్లు పెరిగాయి. టాటా గ్రూప్‌ను అంతర్జాతీయ స్థాయిలో భారీగా విస్తరించారు రతన్ టాటా. ఆయన సారథ్యంలో టాటా గ్రూప్ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగింది. సాఫ్ట్‌వేర్, టెలికం, ఫైనాన్స్, రిటైల్ తదితర రంగాల్లోకి గ్రూప్ విస్తరించింది. రతన్ టాటా బాధ్యతలు చేపట్టినప్పుడు 1991లో కేవలం రూ. 10,000 కోట్లుగా ఉన్న గ్రూప్ టర్నోవరు 2011–12లో ఆయన తప్పుకునే సమయానికి ఏకంగా 100 బిలియన్ డాలర్లకు ఎగిసింది. సాల్ట్ నుంచి సాఫ్ట్‌వేర్ వరకు అన్ని విభాగాల్లోకి విస్తరించింది. పలు విదేశీ కంపెనీలను కొనుగోలు చేయడంతో గ్రూప్ ఆదాయాల్లో దాదాపు సగ భాగం విదేశాల నుంచే ఉంటోంది. ఆయన సాహసోపేత నిర్ణయాల కారణంగా కోరస్, జాగ్వార్ ల్యాండ్ రోవర్, టెట్లీ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు టాటా గ్రూప్‌లోకి చేరాయి. నానో, ఇండికా కార్లు ఆయన విజనే.

వితరణశీలి.. ఇన్వెస్టరు..

రతన్ టాటా గొప్ప వితరణశీలి. తన సంపదలో దాదాపు 60–65 శాతం భాగాన్ని ఆయన వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలకు విరాళమిచ్చారు. 2008లో కార్నెల్ వర్సిటీకి 50 మిలియన్ డాలర్ల విరాళమిచ్చారు. ప్రధానంగా విద్య, ఔషధాలు, గ్రామీణాభివృద్ధి మొదలైన విభాగాలపై దృష్టి పెట్టారు. ఆయన పలు అంకుర సంస్థల్లో విస్తృతంగా పెట్టుబడులు పెట్టారు. వ్యక్తిగత హోదాలో అలాగే ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ద్వారా 30కి పైగా స్టార్టప్స్‌లో ఇన్వెస్ట్ చేశారు. స్నాప్‌డీల్, షావోమీ, ఓలా క్యాబ్స్, మొదలైన వాటిలో పెట్టుబడులు పెట్టారు. సీనియర్ సిటిజన్ల కోసం ఉద్దేశించిన గుడ్‌ఫెలోస్ అనే స్టార్టప్‌కు తోడ్పాటు అందించారు.



పురస్కారాలు
పారిశ్రామిక దిగ్గజంగానే కాకుండా వితరణశీలిగా కూడా పేరొందిన రతన్ టాటాను పలు ప్రతిష్టాత్మక పురస్కారాలు వరించాయి. పద్మ భూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలతో పాటు ఆయన మహారాష్ట్ర భూషణ్, అస్సాం వైభవ్ వంటి అవార్డులను కూడా అందుకున్నారు.

సిమీ గ్రేవాల్‌తో అనుబంధం..
రతన్ టాటా వివాహం చేసుకోవాలనుకున్నా సాధ్యపడలేదని ఆయనే పలు సందర్భాల్లో తెలిపారు. నాలుగు సార్లు వివాహానికి దగ్గరగా వచ్చినా పలు కారణాల వల్ల వెనక్కి తగ్గాల్సి వచ్చిందని చెప్పారు. అప్పట్లో బాలీవుడ్ నటి సిమీ గ్రేవాల్‌తో ఆయన ప్రేమలో పడినట్లు వార్తలు వచ్చినప్పటికీ, ఆమె ఆ తర్వాత మరొకరిని వివాహం చేసుకున్నారు.

మిస్త్రీతో వివాదం..
టాటా గ్రూప్ చైర్మన్‌గా రతన్ టాటా ఏరి కోరి సైరస్ మిస్త్రీని తన వారసుడిగా నియమించారు. కానీ మిస్త్రీ పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడంతో వారిద్దరి మధ్య తలెత్తిన విభేదాలు తారస్థాయికి చేరాయి. చివరికి 2016లో మిస్త్రీ ఉద్వాసనకు దారితీశాయి. దీనిపై ఇరువర్గాల మధ్య సుదీర్ఘ న్యాయపోరాటం జరిగింది.

జిల్లా వార్తలు

రామయ్య సన్నిధిలో భూపాలపల్లి ఎమ్మెల్యే


ధ్వజస్తంభం వద్ద కుటుంబీకులతో ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పండితులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లింగాల సాయిబాబు పాల్గొన్నారు.

తుపాకీ వదిలి.. చాక్‌పీస్ పట్టి !

- కానిస్టేబుల్‌గా పనిచేస్తూ టీచర్‌గా ఎంపిక


కానిస్టేబుల్‌గా విధినిర్వహణలో రంజిత్

టేకులపల్లి: అసాంఘిక శక్తులను అరికట్టేందుకు తుపాకీతో విధులు నిర్వర్తించిన ఆ యువకుడు ఇకపై చాక్‌పీస్ చేతపట్టి పాఠాలు బోధిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దనున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. టేకులపల్లి మండలం దాసుతండా పంచాయతీ పరిధి మంగళితండాకు చెందిన ధరావత్ పాండ్యా – కౌసల్య దంపతుల చివరి సంతానం రంజిత్ మంగలితండా, వరంగల్, టేకుపల్లిలో ఇంటర్ వరకు చదివాక హైదరాబాద్‌లో స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డీఈడీ చేశాడు. ఆపై అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ చేస్తుండగా తృతీయ సంవత్సరంలోనే కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. 2019 సెప్టెంబర్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికైన రంజిత్ వరంగల్, ములుగు జిల్లాల్లో విధులు నిర్వర్తించాక 2022 ఆగస్టులో మహబూబాబాద్ జిల్లా బయ్యారం పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యాడు. ఇటీవల డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో అటు ఉద్యోగం చేస్తూనే సిద్ధమైన ఆయన గతనెల 30న విడుదలైన ఫలితాల్లో భద్రాద్రి జిల్లా ఓపెన్ కేటగిరీలో 10, ఎస్టీ కేటగిరీలో ఐదో ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికయ్యాడు. ఆయన బుధవారం నియామక పత్రం అందుకోగా, ఇటీవల ఆయన మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్, అధికారులు రంజిత్ సత్కరించారు.

17న భక్త శబరికి స్మృత్యంజలి!


భద్రాచలంలోని శబరి విగ్రహం

- భద్రాద్రి రామాలయంలో యాత్ర, పుష్పాంజలి
- గిరిజనుల చెంత రామయ్య కల్యాణానికి ఏర్పాట్లు
- ఈ ఏడాది వినాయకపురంలో నిర్వహించాలని నిర్ణయం

భద్రాచలం: అయోధ్యరాముడి కోసం ఏళ్లుగా ఎదురుచూసి.. అరణ్యవాసంలో ఆయనకు ఎంగిలి పండ్లను ప్రసాదంగా అందజేసి రాముడి కరుణతో ముక్తి పొందిన గిరిజన భక్తురాలు శబరి. ఆమె స్మృతి యాత్ర ఈనెల 17న భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో జరగనుంది. భద్రాచల రామయ్య సన్నిధానాన జరిగే పూజల్లో భక్తులను భాగస్వాములను చేసేందుకు ఈ యాత్రను 2013లో ప్రారంభించారు. ఏటా అశ్వయుజ మాసంలో పౌర్ణమి రోజున జరిగే వేడుక గిరిజనుల సంప్రదాయ నృత్యాలు, ఆటపాటల నడుమ ప్రత్యేకంగా కొనసాగుతుంది.

ఇందులో భాగంగా ఈనెల 17న ఉదయం 6–30 గంటల నుంచి గిరి ప్రదక్షిణ, 8–30 గంటల నుంచి చిత్రకూట మండపంలో నిత్యకల్యాణం, 11.30 గంటలకు వివిధ రకాల పండ్లు, పుష్పాలతో రామయ్యకు పుష్పాంజలి నిర్వహిస్తారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు వారి ప్రాంతాల్లో లభించే పండ్లు, పూలను రామయ్యకు సమర్పించడం ఇందులో ప్రత్యేకత.

గిరిజనుల చెంతనే రామయ్య కల్యాణం

భద్రాచలం దివ్యక్షేత్రంలో దమ్మక్క, శబరికి ప్రత్యేక స్థానం ఉంది. భక్త రామదాసు, తూము నర్సింహదాసు కీర్తనల్లోనూ వీరికి స్థానం దక్కింది. అంతటి ప్రాముఖ్యత ఉన్న వీరిని స్మరించుకుంటూ సాగుతున్న ఈ యాత్రల్లో గతంలో ఏటా గిరిజనులను భాగస్వాములను చేసేవారు. కూనవరం, వీఆర్ పురం, చర్ల, దమ్మపేట వంటి గిరిజన గ్రామాల వాసులను ఆర్టీసీ బస్సుల్లో ఒక రోజు ముందుగానే భద్రాచలానికి తీసుకొచ్చి ఉచిత వసతి, భోజనం కల్పించేవారు. రెండు రోజుల పాటు వీరికి స్వామి వారి ఉచిత దర్శనం, నిత్యకల్యాణంలో పాల్గొనే అవకాశం ఇచ్చేవారు. అయితే ఈఓగా రమాదేవి బాధ్యతలు స్వీకరించాక ఈ కార్యక్రమాలు కొనసాగిస్తూనే గిరిజన గ్రామాలకు ప్రచార రథం పంపించి అక్కడి ప్రజల నడుమే రామయ్య కల్యాణ మహోత్సవం నిర్వహించడం మొదలుపెట్టారు. తద్వారా భద్రాద్రి రామయ్య అందరివాడనే భావన కల్పించడమే కాక రామయ్య తమ ఇళ్ల ముంగిటకు వచ్చాడని గిరిజనులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది శబరి స్మృతి యాత్ర రోజున అశ్వారావుపేట మండలం వినాయకపురంలో ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 8–30 నుంచి 10 గంటల వరకు గ్రామంలో రామయ్య ప్రచారరథంతో శోభాయాత్ర నిర్వహించాక ముత్యాలమ్మ ఆలయంలో కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అదేవిధంగా ఏపీలోని వరరామచంద్రాపురం వద్ద ఉన్న శబరి నది సమీపాన దేవస్థానం ఆధ్వర్యంలో అభిషేకం, వస్త్రాలు, పండ్ల సమర్పణ జరగనుంది.

గిరిజనులు భాగస్వాములు కావాలి



రామయ్య పూజల్లో గిరిజనులను భాగస్వామ్యం చేయడం.. అపర భక్తురాలు శబరిని గుర్తు చేసుకునేందుకు స్మృతి యాత్ర చేపడుతున్నాం. ఈనెల 17వ తేదీన భద్రాచలం రామాలయంలో జరిగే యాత్రలో గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి. అదేవిధంగా అశ్వారావుపేట మండలం వినాయకపురం గిరిజన గ్రామంలో జరగనున్న రామయ్య కల్యాణాన్ని జయప్రదం చేయాలి.

– ఎల్.రమాదేవి, ఈఓ, రామాలయం

ఖమ్మం మార్కెట్‌కు మహర్దశ !


మార్కెట్‌లో నిర్మాణాల నమూనా

- మోడల్ మార్కెట్ నిర్మాణానికి రూ.155.30 కోట్లు
- ఏడు షెడ్లు, కోల్డ్ స్టోరేజీతో నిర్మాణం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలోనే రెండో పెద్దదైన మార్కెట్‌ను దేశంలో మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దాలని ఖమ్మం నియోజకవర్గం నుంచి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా మిర్చి యార్డుల స్థానంలో మోడల్ మార్కెట్ నిర్మాణానికి రూపొందించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం దసరా వేళ ఆమోదించడమే కాక రూ.155.30కోట్లు మంజూరు చేసింది.

ఏ ఇబ్బంది లేకుండా...

ఖమ్మం మార్కెట్‌లో పరిస్థితులను అధ్యయనం చేసిన మార్కెటింగ్ శాఖ ఆర్కిటెక్ట్ బృందం ప్రస్తుతం ఉన్న 15.39 ఎకరాల విస్తీర్ణంలోనే అధునాతనంగా మోడల్ మార్కెట్ నిర్మాణానికి డిజైన్లు రూపొందించింది. 1.50 లక్షల నుంచి 2లక్షల మిర్చి బస్తాలు వచ్చినా ఇబ్బంది ఎదురుకాకుండా నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏడు షెడ్లతో కూడిన మార్కెట్‌తో పాటు కోల్డ్ స్టోరేజీ నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనుల ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం మిర్చికి అన్‌సీజన్ కావటంతో పనులు మొదలుపెడితే సీజన్ మొదలయ్యే నాటికి మూడు నుంచి నాలుగు షెడ్ల నిర్మాణం పూర్తవుతుందని భావిస్తున్నారు.

విదేశాలకు ఎగుమతి

దేశ, విదేశాలకు ఎగుమతి చేసే మిర్చి క్రయవిక్రయాలకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ప్రత్యేకంగా నిలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం నుంచే కాక మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల రైతులు మిర్చి పంటను ఇక్కడకు తీసుకొస్తారు. ఈ ప్రాంతంలో పండించే 'తేజా' రకం మిర్చి చైనా, బంగ్లాదేశ్, థాయిల్యాండ్, మలేషియా, సింగపూర్ వంటి దేశాలకు ఎగుమతి అవుతుంది. డిమాండ్ ఆధారంగా నానాటికీ పంట సాగు విస్తీర్ణం పెరుగుతుండడంతో ఏటా ఖమ్మం మార్కెట్‌కు వచ్చే మిర్చి కూడా అదే స్థాయిలో ఉంటోంది. ప్రస్తుతం ఉన్న యార్డుల్లో సుమారు 60వేల నుంచి 70 వేల బస్తాల వరకే నిల్వ చేసే అవకాశముంది. సీజన్‌లో ఇంతకు మించి మిర్చి వస్తే రహదారుల వెంట బస్తాలను దింపి విక్రయించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

ఆయిల్‌పామ్ రైతులకు దసరా కానుక


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పక్కన రైతు ప్రతినిధులు

- 12న అశ్వారావుపేట ఫ్యాక్టరీలో పవర్‌ప్లాంట్ ప్రారంభం
- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట: ఈ ఏడాది విజయదశమి పర్వదినం ఆయిల్‌పామ్ రైతుల్లో వెలుగులు నింపనుందని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయిల్‌పామ్ అత్యధిక శాతం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో సాగవుతోందని.. ఇప్పటికే దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీలో పవర్‌ప్లాంట్ ఉందని తెలిపారు. ప్రస్తుతం అశ్వారావుపేట ఫ్యాక్టరీలోనూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు రూ.32 కోట్ల వ్యయంతో 2.5 మెగావాట్ల సామర్థ్యంతో పవర్ ప్లాంట్ నిర్మించామన్నారు. ఈ ఫ్యాక్టరీని ఈ నెల 12న విజయదశమి సందర్భంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. పవర్‌ప్లాంట్ ప్రారంభోత్సవంలో రెండు రాష్ట్రాల రైతులు, పలు కంపెనీల ప్రతినిధులు, ఆయిల్‌పామ్ శాస్త్రవేత్తలు పాల్గొంటారని వెల్లడించారు. ఆయిల్‌ఫెడ్ అడ్వైజరీ కమిటీ మెంబర్ ఆలపాటి రామచంద్రప్రసాద్, నాయకులు తుమ్మ రాంబాబు, మొగళ్లపు చెన్నకేశవరావు, సుంకవల్లి వీరభద్రరావు, జేష్ట సత్యనారాయణచౌదరి, వేముల భారతి, కొయ్యల అచ్యుతరావు, సోయం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు భారీగా తరలిరావాలి

ములకలపల్లి: అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో ఈనెల 12న పవర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్నందున రైతులు భారీగా తరలిరావాలని ఆయిల్‌పామ్ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ కోరారు. ములకలపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ సాగుపై అవగాహన కోసం వ్యవసాయ శాస్త్రవేత్తలతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కేదాసి వెంకట సత్యనారాయణ, పర్వతనేని అమర్‌నాథ్, కరుటూరి కృష్ణ, చిలకపాటి జైచందర్‌రావు, మేకల పెద్దవెంకన్న, నల్లమోతు జగదీశ్, బాల అప్పారావు, బింగి శేషగిరి పాల్గొన్నారు.

కోట మైసమ్మ జాతరలో భారీ పోలీసు బందోబస్తు


జాతర ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కారేపల్లి: ఉసిరికాయలపల్లిలోని శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో జరిగే జాతరకు 120 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్లు అదనపు డీసీపీ ప్రసాదరావు తెలిపారు. జాతర ప్రాంగణాన్ని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డితో కలిసి డీసీపీ బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఐదురోజుల పాటు జరిగే జాతరలో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలతో పాటు 120 మంది పోలీసులతో దశలవారీగా బందోబస్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భారీ, చిన్న తరహా వాహనాలకు వేర్వేరు పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నామని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. అలాగే, సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంటుందని తెలిపారు. సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ రాజారాం పాల్గొన్నారు.